క్లుప్తంగా

పీరీల ఊరేగింపు



గూడూరు: గూడూరులో బుధవారం పీరీల ఊరేగింపు సందడి నెలకొంది. పీరీలను డప్పు చప్పుళ్లతో ఊరేగించారు. భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.
చిన్నగూడూరు: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో పీరీల సందడి నెలకొంది. బుధవారం మండల కేంద్రంలో పీరీలను ఊరేగింపు నిర్వహించారు.

28న జాతర ప్రారంభం

గూడూరు: మండలంలోని దామరవంచ జగన్నాయకులగూడెం సమీప మహబూబాబాద్ వైపు జాతీయ రహదారి పక్కన చింతలగట్టు వట్టివాగు ఒడ్డున వెలసిన శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర 2026 జనవరి 28వ తేదీన ప్రారంభమవుతుందని జాతర కమిటీ చైర్మన్ కారం లక్ష్మయ్య, ప్రధాన పూజారి దారం సిద్దు బుధవారం తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన మదన్



నెల్లికుదురు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్ రావును మండలంలోని రత్తిరాం తండాకు చెందిన బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్‌లాల్ హైదరాబాద్‌లో బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్లేట్ల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: సేవా కార్యక్రమాలు చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించాలని రూరల్ ఎస్సై వి.దీపిక అన్నారు. మండలంలోని బలరాంతండాకు చెందిన ఇస్లావత్ బిచ్చనాయక్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఇస్లావత్ కోటినాయక్ అంగన్‌వాడీ విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, వృద్ధులకు చేతి కర్రలు బుధవారం అందజేశారు.

మహిళ ఆత్మహత్య

కురవి: మనస్తాపానికి గురై మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీరోలు ఎస్సై నగేష్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు మండల కేంద్రం శివారు రేకులతండాలో గత నెల 30వ తేదీన ఇస్లావత్ సోనియా(26) తన భర్త మద్యానికి అలవాటు పడి ఏ పని చేయకుండా ఉంటున్నట్లు తెలిపారు. దీంతో సోనియా మనస్తాపంతో పురుగుల మందు తాగింది. మహబూబాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి తేజావత్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జర్నలిస్ట్‌పై దాడి

బయ్యారం: మండలంలో ఓ ఎలక్ట్రానిక్ మీడియాలో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్న పిల్లల నరసింహారావుపై బుధవారం రాత్రి కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బయ్యారం నుంచి తన స్వగ్రామం కొత్తపేటకు వెళ్తున్న నరసింహారావు మోటార్‌సైకిల్‌ను అలిగేరు బ్రిడ్జి వద్ద కొందరు వ్యక్తులు అటకాయించారు. కర్రలతో దాడి చేయటంతో తల, కాళ్లు, చేతులపై బలమైన గాయాలయ్యాయి.

నారుమడిలో 'కేసీఆర్'



బయ్యారం: మండలంలోని కస్తూరినగర్‌లో రైతు రవి తన వరినారుమడిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేరుతో వరినారుని పెంచుతూ తన అభిమానాన్ని చాటుకున్నాడు.

పచ్చిరొట్టతో పెరగనున్న భూసారం

గార్ల: పచ్చిరొట్ట ఎరువు కోసం జీలుగులు, పిల్లిపెసర విత్తనాలు సాగు చేయడం వల్ల పంట భూముల్లో భూసారం పెరుగుతుందని మహబూబాబాద్ ఏడీఏ అజ్మీర శ్రీనివాస్ అన్నారు. బుధవారం గార్ల, మర్రిగూడెం పంచాయతీల్లో సాగుచేసిన జీలుగు పంటను ఆయన క్షేత్ర ప్రదర్శన చేశారు. ఏడీఏ వెంట ఏఓ కావటి రామారావు, ఏఈఓ కిరణ్, రైతులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు



మరిపెడ రూరల్: మరిపెడ మండలం రాంపురం ప్రధాన రహదారి వెంట ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ఓ వైపు పూర్తిగా వ్యవసాయ క్షేత్రాల్లో వాలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇటీవల వర్షంతో కూడిన ఈదురు గాలులు వీచినప్పుడు రెండు విద్యుత్ స్తంభాలు ఓ వైపుకు వంగిపోయాయని గ్రామస్తులు చెబుతున్నారు. వెంటనే సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

కార్యదర్శులపై పనిభారం..!

- పెరిగిన అదనపు బాధ్యతలు
- అప్పులపై నడుస్తున్న అభివృద్ధి
- నిధులు లేక కుంటుపడిన నిర్వహణ



ఉప్పరగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం

పెద్దవంగర: గ్రామాల్లో అభివృద్ధికి వెన్నెముకగా నిలిచే పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుతం తీవ్రమైన పనిభారం, నిధుల కొరతతో సతమతమవుతున్నారు. పలు రకాల ప్రభుత్వం శాఖల పనులన్నీ వారిపైనే పడడంతో ఆర్థికంగా, మానసికంగానూ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మండలంలో 26 గ్రామ పంచాతీలకు ఉండగా 20 మంది కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. రోజువారి విధులతోపాటు ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక, మరుగుదొడ్ల నిర్మాణం , వ్యవసాయ శాఖకు తోడ్పాటు, పాఠశాలల్లో మౌలిక వసతుల సంబంధిత పనులన్నింటిని వారే చూసుకోవాల్సివస్తోంది. దీంతో వారిపై పని భారాన్ని విపరీతంగా పెంచాయి.

అభివృద్ధికి అప్పులే దిక్కు..

18నెలలుగా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు అందడం లేదు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి, ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడంతో రావాల్సిన గ్రాంట్లు నిలిచిపోయాయి. నిధులు లేకపోయిన పంచాయతీ శాఖ ఉన్నత అధికారులు మాత్రం లక్ష్యాలు నిర్దేశిస్తూ గడువులోగా పనులు పూర్తి చేయాలని కార్యదర్శులపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో కార్యదర్శులు సుమారు రూ.లక్ష నుంచి రూ. 3లక్షల వరకు అప్పులు చేసినట్లు తెలుస్తోంది. పంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్లకు డీజిల్ పోయించడానికి కూడా నిధులు లేవు.

పని భారం తగ్గించాలి



మా విధులతోపాటు ఇతర పనులు సైతం నిర్వహిస్తున్నాం. పంచాయితీలకు సర్పంచ్‌లు లేక పోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. ప్రతి పనిని మేమే చేయాల్సి వస్తోంది. ఆర్థికభారం కూడా ఎక్కువగా అవుతుంది. ప్రతి జీపీ కార్యదర్శి సుమారుగా రెండు, మూడు లక్షల రూపాలయ వరకు గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేశారు. పని భారం తగ్గించేలా ప్రభుత్వం చొరవ చూపాలని విజ్ఞప్తి.
– పరమేశ్వర్, టీపీఎస్ఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలి

- డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్



కురవి: మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

కురవి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని డిప్యూటీ స్పీకర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆలయ చైర్మన్ కార్యాలయంలో వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల అధ్యక్షులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని తెలిపారు. గ్రామాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 4వ తేదీన హైదరాబాద్‌లో జరిగే కాంగ్రెస్ పార్టీ సమావేశానికి ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రానున్నారని, అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకట్‌రెడ్డి, బండి శ్రీనివాస్, అంబటి వీరభద్రం గౌడ్, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, గొల్లపల్లి రజనీకాంత్, రాజేందర్‌కుమార్, అవిరె మోహన్ రావు, దయ్యాల శ్రీధర్, కొర్ని అనిల్ పాల్గొన్నారు.

మేలైన విత్తనాలతో పంట దిగుబడి

మరిపెడ రూరల్: సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న మేలైన విత్తనాలతోనే పంట దిగుబడి సాధించవచ్చునని డోర్నకల్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం మరిపెడ మండలం గిరిపురం రైతువేదికలో వంద శాతం సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందించిన కంది విత్తనాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు అందజేశారు. డివిజన్‌కు 150 కందుల సంచులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, ఏఓ బోడ వీరసింగ్, డివిజల్ టెక్నికల్ ఏవో శ్రీదేవి, ఏఈఓలు శ్రీకాంత్, శ్వేత, సాయిశృతి, రెడ్యానాయక్, అశోక్, అరవింద్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్ర



సభలో మాట్లాడుతున్న విజయసారథి

నెహ్రూసెంటర్: దేశంలో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి అన్నారు. పార్టీ మహబూబాబాద్ అర్బన్ 14వ మహాసభ ఫాతిమా, శ్రావణ్ అధ్యక్షతన బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. మహాసభల సందర్భంగా జెండాను మాజీ వార్డు కౌన్సిలర్ బి.నీరజధర్మన్న ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో విజయసారథి మాట్లాడుతూ.. దేశ సంపదను ప్రైవేట్‌పరం చేసేందుకు మోదీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం నీటి నిల్వలేక కోట్లాది రూపాయలు నీళ్లపాలయ్యాయని అన్నారు. జల సమస్యలను విస్మరిస్తే పాలకులకు గుణపాఠం తప్పదని ఆయన పేర్కొన్నారు. ఈనెల 5, 6 తేదీలలో కురవి మండల కేంద్రంలో జరగనున్న పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసభలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, సాంబలక్ష్మీ పాల్గొన్నారు.

విద్యతోపాటు విలువలు నేర్చుకోవాలి

కొత్తగూడ: విద్యార్థులు చదువుతోపాటు విలువలు నేర్చుకోవాలని ఎస్సై కుశకుమార్ సూచించారు. పొగుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, మద్యానికి బానిసలు కావద్దన్నారు. ఎంచుకున్న లక్ష్యం కోసం చదువుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు చేస్తే సహించం'

కొత్తగూడ: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కపై అసత్య ఆరోపణలు ఎవరు చేసినా సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉంటూ ప్రజల కోసమే పనిచేసే ప్రజా నాయకురాలు అని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు చల్ల నారాయణరెడ్డి, ఇర్ప రాజేశ్వర్, రణధీర్, రమేష్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో గల లాల్‌బహదూర్ స్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అర్పనపల్లి యూపీఎస్‌లను ఎంఈఓ కాలేరు యాదగిరి బుధవారం తనిఖీ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ మహేందర్ రెడ్డి

మహబూబాబాద్ అర్బన్: సైబర్ నేరాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని, ఆకతాయిలు వేధిస్తే వెంటనే షీటీంలకు సమాచారం అందించాలని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహర్షి విద్యాలయంలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థినులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి, తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఎస్సై కరుణాకర్, టౌన్ ఎస్సై శివ, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది మోహన్, అనిల్, రాంబాబు పాల్గొన్నారు.

పరిశ్రమ ఏర్పాటుతో ప్రజలకు మేలు

- జెడ్పీ సీఈఓ పురుషోత్తం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ పురుషోత్తం

దంతాలపల్లి: మండలంలో ప్లాస్టిక్ బాటిల్, చెత్తకు సంబంధించిన పరిశ్రమతో ప్రజలకు మేలు కలుగుతుందని జెడ్పీ సీఈఓ పురుషోత్తం అన్నారు. నూతనంగా రూ.60లక్షల వ్యయంతో మండలానికి మంజూరైన ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ యూనిట్ స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం వివిధ గ్రామాలలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ అప్సర్‌పాషా, పీఆర్ ఏఈ సుగుణాకర్‌రాయ్, హౌసింగ్ ఏఈ హేమ పంచాయతీ కార్యదర్శి సృజన పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



మహబూబాబాద్: మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

తొర్రూరు: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి పేర్కొన్నారు. ఈనెల 9న జరుగనున్న దేశవ్యాప్తంగా సందర్భంగా టీయూసీయూ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం రవి మాట్లాడుతూ.. దేశంలో ఉన్న సూమారు రూ.50కోట్ల కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరవపల్లి వెంకన్న, తొర్రూరు అధ్యక్షుడు మంగళ్లపల్లి రామస్వామి, నరసింహ, మురళీ, యాకయ్య పాల్గొన్నారు.

మహబూబాబాద్: ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, సంఘం జిల్లా కార్యదర్శి కాంపెల్లి శ్రీనివాస్ మున్సిపల్ కార్మికులకు పిలుపు నిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, జానీ, వీరన్న, విజయ్, దుర్గయ్య పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: ఈనెల 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. నాయకులు సోమయ్య, రాజమౌళి, సీతారాంనాయక్, వెంకన్న పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే మురళీనాయక్



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు

కేసముద్రం: కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలపై, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో నోరు విప్పకుంటే, మీకే నష్టం అని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఈనెల 6న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేసముద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు వస్తున్న సందర్భంగా నిర్వహించే బహిరంగసభ స్థలాన్ని బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలేదంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిని గమనించి గ్రామాల్లో ఉండే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వారు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, సతీష్, బండారు వెంకన్న, రావుల మురళీ, గుగులోతు దస్రూనాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జీఓను రద్దు చేయాలి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయ ఉద్యోగుల పాలిట శాపంగా మారిన 317 జీఓను రద్దు చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. 317 జీఓ బాధితులతో కలిసి హైదరాబాద్‌లో ధర్నా చేస్తామన్నారు.

శంకుస్థాపన

గార్ల: ఈనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం మండలంలోని పినిరెడ్డిగూడెం, గోపాలపురం గ్రామాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెకు నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు గిన్నారపు మురళీ, శ్రీనివాసరావు, వెంకన్న, సాయిలు వెంకన్న పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నెహ్రూసెంటర్: రసాయన పరిశ్రమ ప్రమాద ఘటనలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్ నాయక్ బుధవారం డిమాండ్ చేశాడు.

విద్యుదాఘాతంతో దూడ మృతి

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజ్) శివారు బంగారుగూడెం తండాలో 25 కేవీ ఎర్త్ తీగ తగిలి బాదావత్ వెంకన్న అనే రైతుకు చెందిన ఆవు దూడ బుధవారం మృతిచెందింది. ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతు డిమాండ్ చేశాడు.

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

మహబూబాబాద్ రూరల్: డాక్టర్స్ డే, సీఏ డే సందర్భంగా వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో వైద్యులు, చార్టెడ్ అకౌంటెంట్లను ఆర్సీ కన్వెన్షన్ సమావేశ మందిరంలో మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మాలె యోగేశ్వరరావు, జిల్లా గవర్నర్ వేమిశెట్టి కిషోర్ కుమార్, క్లబ్ సెక్రటరీ జంగాల విజయ్ కుమార్, ట్రెజరర్ వనమాల సురేష్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలను రద్దు చేయాలి

నెల్లికుదురు: డీమ్డ్ యూనివర్సిటీలతో నిరుపేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఈ వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని పేదల రిజర్వేషన్ పోరాటసమితి (పీఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిరిగాని భిక్షపతి గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీలు కేవలం ధనవంతుల పిల్లలకు మాత్రమే ఉన్నత విద్యను అందుబాటులోకి తెస్తున్నాయన్నారు. అధిక ఫీజులు పారదర్శకత లేని ప్రవేశ ప్రక్రియల కారణంగా నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించకుండా దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సన్మానం



మహబూబాబాద్: రోటరీ క్లబ్ మానుకోట శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో డాక్టర్స్ డే, చార్టర్స్ డే, ప్రపంచ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యులు రవీందర్, మురళీధర్‌రెడ్డి, సాయితేజ, చార్టర్ అకౌంటెంట్ రాజ్‌కుమార్, రైతు రాములును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు వేమిశెట్టి కిశోర్‌కుమార్, విజయ్‌కుమార్, శంతన్ రామరాజు, నాగేశ్వర్‌రావు, వద్దుల సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కిరాయి డబ్బులు చెల్లించడం లేదు

మరిపెడ రూరల్: నెలరోజులు దాటినప్పటికీ ధాన్యం లోడ్ కిరాయి డబ్బులు చెల్లించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అబ్బాయిపాలెం, గాలివారిగూడెం గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బుధవారం బాధిత రైతులు భూక్య కల్యాణ్, బాలు, శక్రు పాల్వాయి వెంకటేశ్వర్లు, ధారావత్ రూప్ల మాట్లాడారు.

అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో సీజనల్ వ్యాధులపై బుధవారం ఆశ కార్యకర్తలు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆశ కార్యకర్తలు సువర్ణ, స్రవంతి, అనిత కోరారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎడ్జెర్ల, గాలివారిగూడెం, మూలమర్రితండా, అబ్బాయిపాలెం, బాల్నిధర్మారం,లక్ష్మాతండా తదితర గ్రామాల్లో రెండోరోజు బుధవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎంపీడీఓ విజయ, ఎంపీఓ సోమ్లానాయక్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల కార్యదర్శిలు గ్రామాల్లోని పారిశుద్ధ్యంపై దృష్టి సారించారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

పెద్దవంగర: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని స్థానిక ఎన్నికల ఇన్‌చార్జ్ రంగు కుమార్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షురాలు నిమ్మల విజయ శ్రీనివాస్, రామచంద్రయ్య శర్మ, శ్రీరాం సంజయ్, సుధీర్, అనపురం రవి పాల్గొన్నారు.

పాఠశాలను సీజ్ చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్వీ పాఠశాల గుర్తింపుతో శ్రీ చైతన్య పాఠశాల నడిపిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సాయికుమార్ సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల ఎదుట బుధవారం సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేవేందర్, ప్రకాష్, తిరుపతి, తరుణ్, విష్ణు, వెంకటేష్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మరిపెడ రూరల్: రైతులందరు తప్పకుండా ఫార్మిట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వీరారం, ఉల్లెపల్లి గ్రామాల ఏఈఓ శ్వేత సూచించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఫార్మిట్ రిజిస్ట్రేషన్ గత నెలలో ప్రారంభమైందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ 13 వార్డు పరిధిలో గల రామచంద్రపురం కాలనీలో పలువురి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కాట భాస్కర్ బుధవారం ప్రారంభించారు.

ఇసుక డంపులు సీజ్

బయ్యారం: మండలంలోని కోయగూడెం సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకడంపులను సీజ్ చేసినట్టు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు 105 క్యూబిక్ మీటర్ల ఇసుకను ఆర్ఐ సీజ్ చేశారన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష



దీక్షలో కూర్చున్న రైతులు

కేసముద్రం: తమకు పట్టాదారు పాస్‌బుక్కులు అందించాలంటూ మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి రెండోరోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా మాజీ ఎంపీటీసీ దారావత్ రవితోపాటు, పలువురు రైతులు మాట్లాడుతూ...2017లో గత ప్రభుత్వం భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా 60ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 1,827 ఎకరాల పట్టాభూములను అటవీ భూములుగా పేర్కొంటూ తమ పట్టాలను రద్దు చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, భీమా, అమరేందర్‌రెడ్డి, విష్ణురెడ్డి, శ్రీలత, అనిత, రాణి, సరోజన, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం



మాట్లాడుతున్న సురేందర్

గూడూరు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్. రాంచందర్‌రావు నియామకంతో తెలంగాణలో జెండా ఎగరడం ఖాయమైందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ముందుగా రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు. అలాంటి వ్యక్తి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతం అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాసమల్ల వెంకన్న, గుండెబోయిన మల్లేష్‌యాదవ్, బత్తుల లక్ష్మణ్, చెల్పూరు శ్రీశైలం, రాజు, మల్లయ్య, అనిల్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం



మాట్లాడుతున్న భిక్షపతి

నెహ్రూసెంటర్: వ్యవసాయ రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని వీడి వ్యవసాయ రంగ అభివృద్ధికి చర్య తీసుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భిక్షపతి, మండల వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బండారి ఐలయ్య, గొని ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, దేవేందర్, లింగయ్య, వెంకటయ్య, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.